అంబర్‌పేట ఎంఆర్‌ఓకు శుభాకాంక్షలు



ఎంఆర్‌ఓను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చాదర్‌ఘాట్: అంబర్‌పేట ఎంఆర్‌ఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీరాబాయిని కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శుక్రవారం ఆమెను కార్యాలయంలో కలిసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని వారు ఎంఆర్‌ఓను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, రామకృష్ణ పాల్గొన్నారు.

లాస్య నందిత కుటుంబానికి తీగల పరామర్శ



పరామర్శిస్తున్న తీగల కృష్ణారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ శాసనసభ్యులు లాస్య నందిత కుటుంబ సభ్యులను శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పరామర్శించారు. సికింద్రాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లి ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ పాల్గొన్నారు.

హయత్‌నగర్ సీఐకి అభినందనలు



సీఐ రామకృష్ణను అభినందిస్తున్న కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: హయత్‌నగర్ సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణను కాంగ్రెస్ నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మన్సూరాబాద్ ఉపాధ్యక్షుడు ఆలూరి పుల్లయ్య, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, సుధాకర్‌గౌడ్, సీతారామ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌కు సత్కారం



వక్ఫ్‌బోర్డు చైర్మన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

సైదాబాద్: పార్టీ పటిష్టతకు కృషి చేసే నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ కార్యదర్శి కోట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన అజ్మతుల్లా హుస్సేన్‌ను ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. కోట్ల శ్రీనివాస్ ఆయనకు శాలువాతో సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ శ్రీరాములు, టీపీసీసీ కార్యదర్శి తాయారు సాది, కార్తీక్ పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు సన్నద్ధం

- ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలే లక్ష్యం
- నిత్యం రెండున్నర గంటల పాటు తరగతులు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యేక శిక్షణ
- ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ర్యాంకుల సాధనే ధ్యేయం



మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహేశ్వరం: ‘పదోతరగతి’ విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టు. వారి బంగారు భవితకు దశ, దిశ నిర్దేశం జరిగేది ఇక్కడే. పదో తరగతిలో ప్రతిభ కనబర్చితే భవిష్యత్‌కు బంగారు బాట పడుతుంది. కానీ వారు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టపడి చదవాల్సిందే. దీని కోసం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వినూత్న తరహాలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభం కానుంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

మండలంలో..

మహేశ్వరం మండలంలో మొత్తం 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ సంవత్సరం 1032 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

భవిష్యత్‌కు పునాది..

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది పదోతరగతి. గతంలో ‘పది’ పరీక్షలకు 11 పేపర్లు ఉండగా రెండేళ్ల నుంచి ప్రభుత్వం 7 పేపర్లకు కుదించింది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం 3 గంటలు ఉంటుంది. ఇందులో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీకి మాత్రమే గంటన్నర చొప్పున ఆయా సబ్జెక్టులకు 3 గంటల సమయాన్ని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

తరగతులు ఇలా..

ప్రతీరోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సాయంత్రం 4.30 నుంచి 6గంటల వరకు రోజు మొత్తం రెండున్నర గంటల ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి సబ్జెక్టులపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఒత్తిడిని అధిగమించాలి..

ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది ‘పది’కి పది మార్కులు ఎవరు సాధిస్తారో వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఆసక్తి కల్గిస్తున్నారు. ఆయా విద్యార్థుల సామర్థ్యాలను బట్టి వారికి తగిన సలహాలు, సూచనలతో తర్ఫీదు ఇస్తున్నారు. పరీక్షలపై భయం వీడి పాఠ్యాంశాలపై ఎలా దృష్టి సారించాలో అవగాహన సదస్సులు నిర్వహించి పరీక్షలపై భయాన్ని పోగొడుతున్నారు.

తర్ఫీదు ఇస్తున్నారు



ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తర్ఫీదు ఇస్తున్నారు. అవసరం ఉన్న వారికి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. – పి. సాయి చరిత, పదో తరగతి, మోడల్ స్కూల్, మహేశ్వరం

‘పది’ జీపీఏ సాధిస్తా



మంచి మార్కులు సాధించేందుకు కష్టపడి చదువుతున్నా. ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నా. పాఠాల్లోని సందేహాలను స్టడీ అవర్స్‌లో నివృత్తి చేసుకుంటున్నాం. పది పరీక్షల్లో కష్టపడి చదివి ‘పది’ జీపీఏ సాధిస్తా. – బి.నందిని, పదో తరగతి

ప్రతీ విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ



ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకె వెళ్తున్నాం. ప్రతిరోజూ సబ్జెక్టుల వారీగా టెస్టులు నిర్వహించి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణతతో పాటు 10 జీపీఏలు ఎక్కువ మంది సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. – బి.ధనుంజయ్,ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్

పాఠశాలల్లో కనీస వసతుల కల్పనకు కృషి



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోర్ వేయిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ‘మీకోసం మేమున్నాం’ స్వచ్ఛంద సంస్థ చైర్మన్, భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. భూపేశ్‌గుప్తానగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎంవీ ఫౌండేషన్ సంస్థ ద్వారా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనిచ్చి వారిని ప్రోత్సహించాలని, ప్రభుత్వ స్కూళ్లలో కనీస వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ సభ్యులు వెంకటస్వామి, సువర్ణ, కాలనీ వాసులు నీరుడు వెంకటేశ్ ముదిరాజ్, జాల శివ కుమార్‌యాదవ్, జాల శ్రీనివాస్‌యాదవ్, కందికంటి భరత్‌గౌడ్, కందకట్ల శికుమార్ రెడ్డి, కె.రాజు, కట్ట మురళి తదితరులు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే బాబాను ఆదర్శంగా తీసుకోవాలి



గాడ్గే బాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నగౌడ్, బ్రహ్మయ్య

నాగోలు: స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రదాత సంత్ గాడ్గే బాబా అన్ని బీఎన్ రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్నగౌడ్, తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దపూర బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం సంత్ గాడ్గే బాబా 149వ జయంతి వేడుకలు శుక్రవారం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో నిర్వహించారు. గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాడ్గే బాబా చేసిన సేవలు ఎనలేనివన్నారు. విద్యాసంస్థలు, అనాథాశ్రమాలు 150 పైగా నెలకొల్పారన్నారు. నేటి యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. స్వచ్ఛ భారత్‌పై మొట్టమొదటిగా అవగాహన కల్పించింది కూడా ఆయనే అని అన్నారు. గాడ్గే బాబా వచ్చే జయంతి, వర్ధంతిలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మద్దెల వినయ్ కుమార్, లింగరాజు, వెంకటేష్ గౌడ్, చైతన్య, రేణుక, కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

‘క్రిడా’లో ముగిసిన జాతీయ సెమినార్



ఉత్తమ పోస్టర్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రిడా)లో సుస్థిర వ్యవసాయం, పర్యావరణ కోసం స్మార్ట్ టెక్నాలజీస్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ఈ సెమినార్‌లో పాల్గొన్న ప్రముఖులు, నిపుణులు వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థలో అత్యాధునిక డిజిటల్ సాంకేతికలను సమగ్ర పర్చడం, కృత్రిమ మేధస్సు, బిగ్ డేటా అనలిటిక్స్, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్, సెన్సార్లు, కమ్యూనికేషన్స్ నెట్‌వర్కులతో సహాయ సహజ వనరుల నిర్వహణలో వ్యవసాయ డిజిటైజేషన్ అంశాలను సమర్పించి చర్చించారు. రైతులు, శాస్త్రవేత్తల పరస్పర సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ముగింపు సందర్భంగా ఐసీఏఆర్-క్రిడా డైరెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సింగ్ సెమినార్‌లో వివిధ కేటగిరీ ప్రదర్శనలు, ఆహ్వానిత ఉపన్యాసాలు, మౌఖిక, పోస్టర్ సెషన్ల వివరాలను సభకు వివరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీఏఆర్ (ఎన్ఆర్ఎం) డీడీజీ డాక్టర్ ఎస్‌కే చౌదరి మాట్లాడుతూ, రెండు రోజుల సెమినార్ సిఫార్సుల ఆధారంగా స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ప్రతినిధులకు సూచించారు. అనంతరం అగ్రోఫిజిక్స్‌లో మాజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎన్ రావును ఘనంగా సత్కరించారు. అనంతరం గ్వాలియర్ ఆర్‌వీఎస్ కేవీవీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏకే సింగ్ మాట్లాడుతూ, సెమినార్‌లో చర్చించిన స్మార్ట్ టెక్నాలజీలను ఉపయోగించేందుకు ప్రణాళికలను రూపొందించాలని ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ పోస్టర్ అవార్డులను అందజేశారు. ఐఎస్ఏపీ ప్రగతి ఫర్మానిక్ మైతీ సెక్రటరీ డాక్టర్ ప్రగతి పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలోకూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో..) టమోటా లోకల్ 15, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 28, క్యారెట్ 19. దొండ 42, ఆలు 25, ఉల్లి 19, గోకర 45, దోస 20, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, అర్వి 50, మునగ 55, చిలగడదుంప 58, బీట్‌రూట్ 23. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఈ-సిటీ శ్రీ ఆదిలక్ష్మి అలివేలు మంగా సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి 26 వరకు ధ్వజస్తంభ, నూతన పంచలోహ విగ్రహాల పునః ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, అర్చకులు శేషం జగన్నాథాచార్యులు,శ్రీనివాసచార్యులు విలేకరుల సమావేశంలో ఈ విషయం పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

కాంగ్రెస్ నాయకుడు సుదర్శన్‌గౌడ్

కొత్తూరు: కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ నుంచి వినాయక స్టీల్ కూడలి వర కు జాతీయ రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకుడు జె.సుదర్శన్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మున్సిపాలిటీ పరిధిలో విస్తరించిన ఈ రోడ్డు పై నుంచి నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయన్నారు. దీంతో జాతీయ రహదారి నుంచి ఆయా కూడళ్లకు వాహనాలు మలుపు తిప్పే క్రమంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.

భట్టి విక్రమార్కకు సన్మానం



భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ గుండంలో స్నానం చేసిన భక్తులకు, మహిళలకు దుస్తులు మార్చుకునే గదులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో తాను పలుమార్లు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. వెంటనే గుండంలో స్నానం చేసే భక్తులకు గదులు నిర్మించాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేశారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు.

నేడు న్యాయ సేవా సదస్సు

చార్మినార్: ఫలక్‌నుమా రవీంద్రనాయక్ నగర్ కాలనీలో ఈ నెల 24న ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహిస్తున్నామని.. స్థానికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అరోరా లీగల్ సైన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ డాలీ గౌతమి తెలిపారు. అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



నంనవనం కాలనీలోని శ్మశానవాటిక పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని నందనవనం కాలనీ శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని, అప్పుడే పనులు త్వరితగతిన పూర్తి కావడమే కాకుండా పనుల్లో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడతామని, నందనవనం శ్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు కార్పొరేటర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈ హేమూనాయక్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్వరలో పెద్దచెరువు ప్రాంగణంలో ఓపెన్ జిమ్



మన్సూరాబాద్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న కార్పొరేటర్, జెడ్సీ తదితరులు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో త్వరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యలతో కలిసి ఆయన శుక్రవారం పెద్దచెరువును పరిశీలించారు. ఈ సంద్రభంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో చెరువుల హద్దులు మారుతున్నాయని తాను ప్రస్తావించడంతో అధికారులు పరిశీలనకు వచ్చారన్నారు. చెరువులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు చర్యలు చేపట్టాలని అధికారులను కోరానన్నారు. పెద్దచెరువులోకి మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టామని, వాకర్స్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతో లైటింగ్ వేయలేకపోతున్నామని, ఆయా శాఖల అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, కవితారెడ్డి, వాకర్స్, అధికారులు పాల్గొన్నారు.

సిరిహిల్స్ కాలనీలో మార్నింగ్ వాక్...

మార్నింగ్‌వాక్‌తో ప్రజా సమస్యలను తెలుసుకునే ఆస్కారం ఎక్కువగా ఉంటుందని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి సిరిహిల్స్ కాలనీలో శుక్రవారం మార్నింగ్ వాక్ చేసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రవీందర్‌రెడ్డి, మురళి, సర్వేశ్వరచారి, శంకర్‌గౌడ్, బాల్‌రెడ్డి, చంద్రం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు



కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో శుక్రవారం అంబర్‌పేట, సైదాబాద్ మండలాల పరిధిలోని రసూల్‌పుర, పద్మనగర్, శంకర్‌నగర్, కాలాడేరా కాలనీ, ఆజంపుర, అక్బర్‌బాగ్, శంకేశ్వర్‌బజార్, జయనగర్, ఎల్‌సీహెచ్ కాలనీ, పూసలబస్తీ ప్రాంతాలకు చెందిన 34 మందికి షాదీ ముబారక్, 41 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. మండల రెవెన్యూ అధికారులు హరిబాబు, శ్రీకాంత్, మజ్లిస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై కోపంతోనే కాంగ్రెస్‌కు అధికారం

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నాగోలు: కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలో వచ్చిందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి విమర్శించారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం నాగోలులో ఏర్పాటు చేసిన సభలో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌పై ప్రజలకు ఉన్న కోపంతోనే కాంగ్రెస్‌కు అధికారం దక్కింది తప్ప.. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తుందని ప్రజలు ఆ పార్టీకి ఓటు వేయలేదని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనే దేశానికి శ్రీరామ రక్ష అని అన్నారు. దేశ భవిష్యత్ కోసం మోదీని మరోసారి ప్రధాని చేయాలని కోరారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీజేపీ జెండా ఎగరవేసి విజయోత్సవ ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చిరు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధించిన అన్నారు. నాగోలు ప్రాంతంలో అసైన్డ్ భూముల సమస్య పరిష్కారం కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 118 తీసుకువచ్చిందని, దానిని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 118 జీఓను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 58లోని పట్టాదారులకు పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం తప్ప.. మిగతా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు మాట్లాడుతూ, దేశంలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడ చూసినా అవినీతి, కుంభకోణాలేనని, నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత దేశంలో అవినీతి లేని పాలన జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నాగోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, వేదికపై ఈటల, మురళీధర్‌రావు తదితరులు